క్లుప్తంగా

రక్తదాన శిబిరం పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సౌత్ ఏసీపీ త్రినాథ్

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డు తుంగ్లాంలో కాకి కుంచారావు జ్ఞాపకార్థం శనివారం రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు గ్రామ యువత తెలిపారు. గాజువాక పోలీస్ స్టేషన్‌లో సౌత్ ఏసీపీ త్రినాథ్ చేతుల మీదుగా శిబిరం పోస్టర్‌ను శుక్రవారం ఆవిష్కరింపజేశారు. శిబిరానికి ముఖ్య అతిథిగా ఏసీపీని ఆహ్వానించారు. కార్యక్రమంలో కాకి రామిరెడ్డి, సీరపు శంకర్ రెడ్డి, కాకి గోవిందరెడ్డి, కోన హరి తదితరులు పాల్గొన్నారు.

'ఉక్కు' ఆస్పత్రి సిబ్బందికి లాంగ్ సర్వీస్ అవార్డులు



ఉద్యోగులకు లాంగ్ సర్వీసు అవార్డులు అందజేస్తున్న విభాగాధిపతి డాక్టర్ ప్రకాశ్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ జనరల్ ఆస్పత్రి సిబ్బందికి శుక్రవారం లాంగ్ సర్వీసు అవార్డులు అందజేశారు. స్టీల్‌ప్లాంట్‌లో చేరి 25 ఏళ్లు పూర్తి చేసుకున్న ఝాన్సీ మేరీ, జె.జి.వి.రత్నం, ఆకుల రవణమ్మ, శారద, లక్ష్మీదేవి, చంద్రన్ రూత్‌లకు ఆస్పత్రి కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన కార్యక్రమంలో హెచ్‌ఆర్ విభాగాధిపతి డాక్టర్ కె.హెచ్.ప్రకాశ్ చేతుల మీదుగా 150 గ్రాముల సిల్వర్ కాయిన్, సర్వీస్ సర్టిఫికెట్ ప్రదానం చేశారు. హెచ్‌ఆర్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ ఎ.పి.నవీన్ కుమార్, డాక్టర్ గిరిధర్, డాక్టర్ సుధ, మల్లేశ్వరి, కె.గోపాలకృష్ణ, జె్రిపోతు మోహన్‌కుమార్, సుందరమణి, భాస్కర్ పాల్గొన్నారు.

రాజ్‌మాతా భారత్ గౌరవ్ పురస్కారానికి ఎంపిక



కె. నర్సింగరావు

గాజువాక : శ్రీరాజమాతా విజయ రాజీ సింధియా ఫౌండేషన్ అందించనున్న రాజ్‌మాతా భారత్ గౌరవ్ పురస్కారానికి గాజువాకకు చెందిన కేఎన్నార్ ఫౌండేషన్ చైర్మన్ కరణంరెడ్డి నర్సింగరావు ఎంపికయ్యారు. ఈనెల 5న ఢిల్లీలో నిర్వహించనున్న కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని నర్సింగరావుకు ప్రదానం చేయనున్నారు. ఈ మేరకు సంబంధిత ఫౌండేషన్ నుంచి తనకు శుక్రవారం ఆహ్వానం అందినట్టు ఆయన తెలిపారు.

అటల్ టింకరింగ్ ల్యాబ్ ఆకస్మిక తనిఖీ

మధురవాడ: కొమ్మాది రిక్షా కాలనీలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ పాఠశాలలో అటల్ టింకరింగ్ ల్యాబ్‌ను స్టేట్ అటల్ టాస్క్ ఫోర్స్ బృందం శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేసింది. బృందంలో అధికారులు ఎస్.వి.రమణ, జిల్లా సైన్స్ ఆఫీసర్ కె.ప్రసాద్, సీహెచ్ గిరిప్రసాద్ పలు అంశాలు పరిశీలించి, ప్రాజెక్టుల గురించి తెలుసుకున్నారు. ల్యాబ్ పరిశీలించి, విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి, సరైన సమాధానాలు చెప్పడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. మారథాన్, ఇన్నోవేషన్‌లో పాల్గొన్న విద్యార్థినులు, వారి ప్రాజెక్టుల గురించి ఆరా తీశారు. హెల్త్ కోటులో భాగంగా ప్రాజెక్టు నిర్వహించిన 10వ తరగతికి చెందిన సౌజన్యతో మాట్లాడి, ప్రాజెక్టు గురించి తెలుసుకున్నారు. విద్యార్థినుల అవార్డులను, సర్టిఫికెట్లను, ల్యాబ్ రికార్డు నగదు లావాదేవీలను తనిఖీ చేశారు. వర్కుషాపులు, బూట్ క్యాంపులు, రికార్డులు పరిశీలించారు. ఐఎఫ్‌పీ ప్యానెల్ ద్వారా క్లాసులు నిర్వహిస్తూ వాటిని రికార్డు చేయాలని తెలిపారు. వ్యక్తిగత ల్యాబ్ రికార్డులు నిర్వహిస్తూ 15 రోజులకు ఒక్కసారి సంబంధిత అధికారి చేత వెరిఫికేషన్ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ టి.నాగమణి, అటల్ ల్యాబ్ ఇన్‌చార్జి శ్రీకాంతి, సైన్స్ టీచర్లను అభినందించారు.

దేశానికే ఆదర్శం 'ఆరోగ్య సురక్ష'



హోమియో వైద్యవిభాగంలో డాక్టర్ శ్రీదేవితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి, జెడ్సీ సింహాచలం



వినికిడి సమస్యతో వచ్చిన రోగి వివరాలు తెలుసుకుంటున్న వైద్యురాలు



వైద్య శిబిరంలో పేషెంట్ సమస్యను అడిగి తెలుసుకుంటున్న డాక్టర్ ప్రియాంక



కంటి వైద్య పరీక్ష చేస్తున్న వైద్యురాలు

- పేదలకు స్పెషలిస్ట్ వైద్యులతో ఉచిత సేవలు
- ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి
- వైద్య శిబిరాలకు విశేష స్పందన

పెదగంట్యాడ: ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష దేశానికే ఆదర్శమని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సత్సంకల్పంతో రూపుదిద్దుకున్న ఈ కార్యక్రమం ప్రజారోగ్యానికి రక్షగా నిలుస్తోందన్నారు. జీవీఎంసీ 65వ వార్డు వాంబే కాలనీ సచివాలయం పరిధి గిరిజాకాలనీ యూపీహెచ్‌సీ వద్ద శుక్రవారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ఒక్క రూపాయి ఖర్చు లేకుండా పేదలందరికీ నాణ్యమైన వైద్యం అందుతోందన్నారు. ఆరోగ్యాంధ్రప్రదేశ్ లక్ష్యంగా పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు ఇంటి వద్దకే అందించడం పేదలందరికీ వరమన్నారు. దేశంలోనే మొదటిసారిగా మన రాష్ట్రంలోనే ఇటువంటి కార్యక్రమం అమలు చేశారన్నారు.

501 మందికి వైద్య సేవలు

శిబిరానికి హాజరైన 501 మందికి ఐదుగురు వైద్యులు సేవలు అందించారు. వైద్యుల సూచనల మేరకు సిబ్బంది రోగులకు రక్త పరీక్షలు, ఇతర పరీక్షలను నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జోన్-6 జోనల్ కమిషనర్ పి.సింహాచలం, ఏఎంవోహెచ్ కిరణ్‌కుమార్, వైద్యాధికారి వరలక్ష్మి, కార్పొరేటర్ బొడ్డు నరసింహపాత్రుడు, నాయకులు లోకనాథం, నాగిశెట్టి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అందరికీ విద్య, వైద్యం

అగనంపూడి: రాష్ట్రంలోని ప్రజందరికీ ఉన్నత ప్రమాణాలతో విద్య, వైద్యం ఉచితంగా అందించేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. 85వ వార్డు దిబ్బపాలెంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడారు. ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యం అందించడం కోసం ప్రభుత్వ యంత్రాంగం శ్రమిస్తోందన్నారు. వైద్యనిపుణుల పర్యవేక్షణలో సేవలు అందిస్తుండడంతో శిబిరాలకు మంచి స్పందన లభిస్తోందన్నారు. ఈ సందర్భంగా 512 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు అందించారు. కార్యక్రమంలో గాజువాక జోనల్ కమిషనర్ పొందూరు సింహాచలం, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొడ్డ గోవింద్, రాష్ట్ర సేవాదళ్ ప్రధాన కార్యదర్శి ఇల్లపు ప్రసాద్, నాయకులు నక్కా రమణబాబు, ఎల్.వి.రమణ, యలమంచిలి చిన అప్పారావు, గంగరాజు, కర్రి రమణమ్మ, తోకాడ చంద్రమౌళి, సచివాలయ అడ్మిన్ దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

68వ వార్డులో 526 మందికి వైద్య సేవలు

అక్కిరెడ్డిపాలెం: 68వ వార్డు మిందిలో నిర్వహించిన ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఎమ్మెల్యే నాగిరెడ్డి పరిశీలించారు. శిబిరంలోని వివిధ విభాగాలను పరిశీలించి, రోగులకు మందులు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి గుడివాడ లతీష్ తదితరులు పాల్గొన్నారు.

526 మందికి వైద్య సేవలు

శిబిరంలో 526 మందికి వైద్యసేవలు అందజేశారు. వార్డు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక, డాక్టర్ గౌతమి, డాక్టర్ పవన్ (ఆర్థో), డాక్టర్ శాంతి రూప (పెథాలజీ), డాక్టర్ అరుణ (డెంటల్), డాక్టర్ అంజని రోగులను పరీక్షించారు. కార్యక్రమంలో నాయకులు పోలవరపు శ్రీహరి, రెడ్డిపల్లి చిట్టిబాబు, రొక్కం వెంకట్రావు, తిరుపతి ప్రసాద్, శాంతి కుమారి, డీఈ అప్పారావు, రామ్ నారాయణ్ తదితరులు పాల్గొన్నారు.

73వ వార్డులో..

గాజువాక : 73వ వార్డు గొంతినవానిపాలెంలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి ప్రారంభించారు. వైద్య, ఆరోగ్య సిబ్బంది రోగులకు వైద్య పరీక్షలతో పాటు అవసరమైన రక్త పరీక్షలు, ఇతర పరీక్షలను ఉచితంగా నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో 73వ వార్డు కార్పొరేటర్ భూపతిరాజు సుజాత, వైద్యాధికారి డాక్టర్ పి.హేమలత తదితరులు పాల్గొన్నారు.



గిరిజా కాలనీ యూపీహెచ్‌సీలో రోగిని పరీక్షిస్తున్న వైద్యాధికారి వరలక్ష్మి



73వ వార్డులోని శిబిరంలో రోగికి మందులు అందిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి



85వ వార్డు దిబ్బపాలెంలో పౌష్టికాహార స్టాల్ పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న భక్తులు

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు పెదమడకలోని ఉమామహేశ్వరస్వామి ఆలయ 29వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విశేష పూజలు చేశారు. అనంతరం పార్వతీపరమేశ్వరుల కల్యాణ మహోత్సవాన్ని కనులపండువగా జరిపించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు దానబాల అప్పలనాయుడు, కట్టా పైడిరాజు, గెద్దాడ సత్యనారాయణ, అప్పలరాజు, దొడ్డి దేముడు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు దుప్పట్ల పంపిణీ



పారిశుధ్య కార్మికులకు దుప్పట్లు, దుస్తులు పంపిణీ చేస్తున్న రావూరి సుబ్బారావు

పెదగంట్యాడ: రోటరీ క్లబ్ ఆఫ్ గాజువాక సేవలు భేష్ అని రోటరీ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ రావూరి సుబ్బారావు కొనియాడారు. సమతానగర్‌లోని రోటరీ క్లబ్‌ను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్లబ్ ద్వారా సేవలను మరింతగా విస్తరించాలని సూచించారు. గత నెల 16 నుంచి 22 వరకు కెనడాలో నిర్వహించిన ప్రపంచ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో సిల్వర్‌మెడల్ సాధించిన శివాజీని, ఉచితంగా యోగా శిక్షణ ఇస్తున్న కొల్లి ఈశ్వరరావును సత్కరించారు. అనంతరం పలువురు పారిశుధ్య కార్మికులకు దుప్పట్లు, దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నక్క లక్ష్మణరావు, సత్యవాణి, విక్టర్ రాజు, జాన్ డీన్, సిరట్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు అమరవీరులకు నివాళి



ఉక్కు అమరవీరులకు నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే, నాయకులు

ఉక్కునగరం: స్టీల్ వైఎస్సార్‌టీయూసీ ఆధ్వర్యంలో ఉక్కు అమరవీరులకు శుక్రవారం నివాళి అర్పించారు. విశాఖ ఉక్కు-ఆంధ్రుల హక్కు నినాదంతో 21 రోజుల పాటు ఆమరణ నిరాహార దీక్ష చేసిన ఉక్కు ఉద్యమ నేత టి.అమృతరావు దీక్ష విరమించిన రోజు సందర్భంగా యూనియన్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య ముఖ్య అతిథిగా హాజరై అమృతరావు విగ్రహానికి పూలమాల వేసి, నివాళి అర్పించారు. ఆయన మాట్లాడుతూ అమృతరావు ఆనాడు నిస్వార్థంగా చేసిన దీక్ష ద్వారా తన ప్రాణాలు అర్పించానికి సిద్ధపడ్డారన్నారు. ఆ ఆందోళనకు కేంద్ర ప్రభుత్వం దిగి వచ్చి నాటి ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డి చేత నిమ్మరసం ఇప్పించి, దీక్ష విరమింప చేసిందన్నారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి వై.మస్తానప్ప మాట్లాడుతూ అమరవీరుల త్యాగాన్ని నేటితరం తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు కర్రి దాలినాయుడు, జి.అప్పలరెడ్డి, ఎన్నేటి రమణ, నల్లమిల్లి శ్రీనివాసరెడ్డి, డి.అప్పలరాజు, పులి పెంటయ్యరెడ్డి, మురళి, బొడ్డ గోవింద తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతిపై వెళ్తున్న అధికారికి సత్కారం



సింహాచలాన్ని సత్కరిస్తున్న ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది

అగనంపూడి: అగనంపూడి ఏరియా ఆస్పత్రి ఆఫీస్ సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహించి, విజయనగరం జిల్లా సాలూరు ఏరియా ఆస్పత్రి పరిపాలనాధికారిగా పదోన్నతిపై వెళ్తున్న సింహాచలంను ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జె.భారతి, నర్సింగ్ సూపరింటెండెంట్ హేమలక్ష్మి, వైద్యులు ఘనంగా సత్కరించి, ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఆస్పత్రి కమిటీ ప్రతినిధులు గొలగాని శ్రీనివాసరావు, వైద్యులు డాక్టర్ గోపీకృష్ణ, కృష్ణమూర్తి, భక్తవత్సలం, సిబ్బంది జ్యోతిలక్ష్మి, రాజేశ్వరి, బి.అప్పారావు పాల్గొన్నారు.

11న విశ్వరూప మహాసభ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న డాక్టర్ రాజారావు, గురుమూర్తి తదితరులు

పెదగంట్యాడ: ఈ నెల 11న హైదరాబాద్‌లో నిర్వహించనున్న విశ్వరూప మహా సభను విజయవంతం చేయాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నాయకుడు డాక్టర్ ఎస్. రాజారావు కోరారు. ఈ మేరకు చలో హైదరాబాద్ పోస్టర్‌ను పెదగంట్యాడ ఎస్సీ కాంప్లెక్స్ వద్ద శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సభకు ప్రధాని నరేంద్ర మోదీ హాజరు కానున్నారని తెలిపారు. ఉత్తరాంధ్ర నుంచి పెద్ద సంఖ్యలో నాయకులు తరలి రావాలని కోరారు. పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టేలా ప్రధానిని కోరాలన్నారు. కార్యక్రమంలో గంట్యాడ గురుమూర్తి, దేవుపల్లి సంపూర్ణం, మార్టుపూడి పరదేశి, ములకలపల్లి చిన్నారావు, నరసింగరావు, కాకినాడ పెంటారావు పాల్గొన్నారు.

ప్రశాంతంగా 'పాఠశాల విద్యా సాధన సర్వే'



అక్కిరెడ్డిపాలెం హైస్కూల్‌లో తరగతి అంశాలపై సర్వే నిర్వహిస్తున్న డీఈవో చంద్రకళ



నడుపూరు హైస్కూల్‌లో పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఎంఈవోలు రమణాజీ, శ్రీనివాస్

అక్కిరెడ్డిపాలెం: పాఠశాల విద్యా సాధన సర్వే పరీక్ష (స్టేట్ ఎడ్యుకేషనల్ ఎచీవ్‌మెంట్ సర్వే -ఎస్‌ఈఏఎస్)పరీక్షను నియోజకవర్గంలోని వివిధ పాఠశాలల్లో శుక్రవారం ప్రశాంతంగా నిర్వహించారు. 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్లో విద్యార్థులకు నిర్వహించిన సర్వేను డీఈవో ఎల్.చంద్రకళ శుక్రవారం పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 3,6,9 తరగతుల విద్యార్థులకు నిర్వహించిన పరీక్షలకు 14202 (95.09 శాతం) మంది విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు. ఏఎంవో జి.లక్ష్మితో కలిసి ఐదు పాఠశాలల చొప్పున సందర్శించినట్లు తెలిపారు. అక్కిరెడ్డిపాలెం జెడ్పీ హై స్కూల్‌లో 6, 9 తరగతుల విద్యార్థులను పరిశీలించామన్నారు. ఎంఈవోలు, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుల సహకారంతో ఈ సర్వేను విజయవంతంగా పూర్తి చేశామని చెప్పారు. పాఠశాల హెచ్‌ఎం ఎం.ఎల్.ఎస్.కాంతం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెదగంట్యాడలో 1140 మంది హాజరు

పెదగంట్యాడ: ఎస్‌ఈఏఎస్ పరీక్షను శుక్రవారం మండలంలో ప్రశాంతంగా నిర్వహించారు. 3, 6, 9 తరగతులు చదువుతున్న విద్యార్థులకు నడుపూరు జిల్లా పరిషత్ హైస్కూల్, గంగవరం హైస్కూల్, ఇస్లాంపేట జిల్లా పరిషత్ హైస్కూల్, యారాడ జిల్లా పరిషత్ హైస్కూల్, నడుపూరు ప్రైమరీ పాఠశాలతో పాటు మదీనాబాగ్, దిబ్బపాలెం, వియ్యపువానిపాలెం, మొల్లివానిపాలెం, పెదగంట్యాడ, దయాల్‌నగర్‌లోని తదితర ప్రైవేటు పాఠశాలల్లో ఈ పరీక్ష నిర్వహించారు. మొత్తం 1140 మంది విద్యార్థులు ఈ పరీక్షకు హాజరయ్యారు. డైట్, ఇతర కళాశాలలకు చెందిన విద్యార్థులు ఫీల్డ్ ఇన్విజిలేటర్లగా వ్యవహరించారు. ఎంఈవోలు శ్రీనివాస్, రమణాజీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఈ పరీక్ష నిర్వహించిందని తెలిపారు. ముందుగా వీరు పరీక్ష నిర్వహిస్తున్న పాఠశాలలను సందర్శించి పరీక్ష తీరును పరిశీలించారు.

వైద్యుల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

మహారాణిపేట : వైద్య ఆరోగ్య శాఖలో పలు విభాగాలకు చెందిన వైద్యుల పోస్టులు భర్తీ చేస్తున్నారు. పలు మెడికల్ ఆఫీసర్ పోస్టులు కాంట్రాక్ట్, మెరిట్, రిజర్వేషన్ల ప్రకారం భర్తీ చేస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఈ పోస్టులను భర్తీ చేస్తున్నామన్నారు. ఇతర వివరాలకు http@//visakhapatnam. nic. in నుంచి దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. దరఖాస్తుతో పాటు విద్యార్హత నకలు కాపీని ఈనెల 8వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి వారి కార్యాలయంలో అందజేయాలని తెలిపారు. ఇతర వివరాలు వెబ్‌సైట్‌లో చూడాలని డీఎంహెచ్‌వో తెలిపారు.

పోరాటాలతోనే స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ సాధ్యం



995వ రోజు ఉక్కుదీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: ఎందరికో ఉపాధినిస్తున్న విశాఖ ఉక్కును పోరాటాలతోనే కాపాడుకోగలమని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు పేర్కొన్నారు. కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న ఉక్కు రిలే నిరాహార దీక్షల్లో శుక్రవారం, 995 వ రోజు సంస్థకు చెందిన ఆర్‌ఎండీ, కన్‌స్ట్రక్షన్ విభాగ కార్మికులు, ఉక్కు నిర్వాసితులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ 75 ఏళ్ల భారతదేశంలో అనేక మంది ప్రధానమంత్రులు ప్రభుత్వరంగ సంస్థలను నెలకొల్పి పేద, బడుగు, బలహీనవర్గాల ప్రజలకు ఉపాధి అవకాశాలు మెరుగుపరిచారన్నారు. కానీ నేటి పాలకులు ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తూ పేదప్రజల జీవితాలను సర్వనాశనం చేస్తున్నారని విమర్శించారు. ఈ నేపథ్యంలో ఉక్కు ఉద్యమాన్ని మరింత ముందుకు తీసుకువెళ్లేందుకు విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 8వ తేదీన చేపట్టనున్న నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఇప్పటికైనా కేంద్రప్రభుత్వ పెద్దలు విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయాన్ని విరమించుకోవాలని, లేదంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కొనక తప్పదని అన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

అంతర్ కళాశాలల కబడ్డీ విజేత 'రఘు'



విజేత జట్టు రఘు ఇంజినీరింగ్ కళాశాల

అగనంపూడి: దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలలో రెండు రోజుల పాటు నిర్వహించిన జేఎన్‌టీయూ గురజాడ, విజయనగరం పరిధిలోని కళాశాలల కబడ్డీ పోటీల్లో రఘు ఇంజినీరింగ్ కళాశాల జట్టు విజేతగా నిలిచింది. దువ్వాడ విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాల జట్టు రన్నరప్‌గా నిలిచింది. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ జిల్లాల నుంచి 15 జట్లు పాల్గొనగా ఫైనల్‌లో రఘు ఇంజినీరింగ్ కళాశాల, విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలల జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. ముగింపు కార్యక్రమంలో దువ్వాడ కళాశాల రెక్టార్ వి.మధుసూదనరావు మాట్లాడుతూ విజేత జట్లు అంతర్ రాష్ట్ర పోటీల్లో పాల్గొనున్నాయని తెలిపారు. కార్యక్రమంలో సీఈవో శ్రీకాంత్, ప్రిన్సిపాల్ జె.సుధాకర్, వైస్ ప్రిన్సిపాల్ రవీంద్ర, పీడీ రాంబాబు పాల్గొన్నారు.

క్రాస్ బౌ షూటింగ్‌లో విశాఖ షూటర్ల

కొమ్మాది/దాబాగార్డెన్స్: ఆగ్రాలో గత నెల 26 నుంచి 31 వరకు జరిగిన 10వ అంతర్జాతీయ క్రాస్ బౌ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో విశాఖ షూటర్లు సత్తా చాటారు. ఎండాడకు చెందిన వి.ఎస్ లోకజిత్ జూనియర్ బాలుర ఓపెన్ ఫ్రీస్టైల్ కేటగిరీలో స్వర్ణ పతకం, నగరానికి చెందిన సాయి కౌశిక్ రెండు వెండి పతకాలు సాధించాడు. అత్యంత చిన్న వయసులోనే లోకజిత్ అంతర్జాతీయ స్థాయిలో స్వర్ణ పతకంపై తల్లిదండ్రులు రవికుమార్,సహజ హర్షం వ్యక్తం చేశారు. ఆస్ట్రేలియా, , స్వీడన్, ఫిన్లాండ్, యూఎస్ఏ, యూకే, పోర్చుగల్‌తో పాటు దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి 65 మంది ఈ పోటీల్లో పడ్డారు.

ఖైదీ రాజాచంద్ర మృతిపై 7న విచారణ

తగరపువలస: తెలంగాణలోని రంగారెడ్డి జిల్లా బండ్లగూడకు చెందిన ఖైదీ యడ్ల రాజాచంద్ర (41) ప్రభుత్వ మెంటల్ కేర్ ఆస్పత్రి చికిత్స పొందుతూ ఈ ఏడాది మార్చి 9న మృతి చెందినట్టు వైద్యాధికారులు నిర్ధారించారు. దీంతో రాజాచంద్ర మృతిపై భీమిలి ఆర్డీవో ఎస్.భాస్కరరెడ్డిని విచారణ అధికారిగా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున నియమించారు. ఈ నెల 7న భీమిలి ఆర్డీవో భాస్కరరెడ్డి తన కార్యాలయంలో ఉదయం 11 గంటలకు విచారణ నిర్వహించనున్నారు. రాజాచంద్ర మృతిపై ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే విచారణకు హాజరై మౌఖికంగా లేదా లిఖితపూర్వకంగా తెలియచేయాలని భాస్కరరెడ్డి ఓ ప్రకటనలో కోరారు.

ఎన్టీపీసీ సింహాద్రిలో వెండర్ మీట్ ఏర్పాటు

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీ టౌన్‌షిప్‌లో శకుంతలం ఆడిటోరియంలో విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్-2023లో భాగంగా శుక్రవారం వెండర్ మీట్‌ను నిర్వహించారు. ఈ సమావేశంలో వివిధ సంస్థ నుంచి 50 మంది విక్రేత ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి రీజినల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (వెస్ట్-2) సి.శివకుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సమావేశంలో పాల్గొన్న మీట్ వెండర్ల సమస్యలను అంచన వేశారు. వివిధ పీఎస్‌యూల్లో సాంకేతికతను ఉపయోగించడంలో ఎన్టీపీసీ ముందంజలో ఉన్నందుకు సింహాద్రి ఎన్టీపీసీ ప్రతినిధులను అభినందించారు. ఈ సమావేశంలో యూఎస్ఎస్‌సీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎ.కుందు, చీఫ్ జనరల్ మేనేజర్ యు.హెచ్.గోఖే పాల్గొన్నారు. సింహాద్రి ప్రాజెక్టు హెడ్ సంజయ్‌కుమార్ సిన్హా, వీపీజీ చీఫ్ జనరల్ మేనేజర్ బి.రామారావు, డీజీఎంలు, ఉద్యోగులు హాజరయ్యారు.

సామాజిక సాధికార యాత్రను జయప్రదం చేద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ భూపతిరాజు సుజాత

గాజువాక : ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాలతో మంత్రులు చేపట్టిన సామాజిక సాధికార బస్సు యాత్రను జయప్రదం చేయడం అందరి బాధ్యత అని 73వ వార్డు కార్పొరేటర్ భూపతిరాజు సుజాత అన్నారు. ఈ నెల 6న గాజువాకలో నిర్వహించనున్న యాత్రను విజయవంతం చేయాలని కోరారు. సనత్‌నగర్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి సారథ్యంలో అన్ని వర్గాలకు న్యాయం జరిగిందని, ఈ విషయాన్ని ప్రజలకు వివరించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని అన్నారు. వైఎస్సార్‌సీపీ క్లస్టర్ అధ్యక్షుడు రాజాన వెంకటరావు మాట్లాడుతూ గాజువాకలో సామాజిక సాధికార యాత్రను జయప్రదం చేసి ప్రజల్లో ప్రభుత్వానికున్న ప్రతిష్టను ఇనుమడింపజేయాలని కోరారు. ప్రజలందరూ జగన్ మోహన్‌రెడ్డివైపు ఉన్నారని అందరికీ అర్థమయ్యే విధంగా సభను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ రెడ్డి జగన్నాథం, నాయకులు కంది పైడినాయుడు, గొరుసు సత్యం, వార్డు కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ క్యాడెట్లకు అభినందన

సీతంపేట: లంకపల్లి బుల్లయ్య కళాశాలకు చెందిన నౌసైనిక్ క్యాడెట్లు ఎండీ ముబీన్, ఎ.విజయ్‌కుమార్, వాయు సైనిక్ క్యాడెట్లు పవన్ కార్తికేయ, రామ్ నారాయణలను కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ జి. మధుకుమార్ అభినందించారు. ముంబయిలోని లోనావాలలో జరిగిన అఖిల భారత నౌసైనిక్ శిబిరంలో ముబీన్, విజయ్, ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ జలహల్లి, బెంగళూరులో జరిగిన అఖిల భారత వాయు సైనిక్ శిబిరంలో పవన్, రామ్‌లు పాల్గొన్నారు. వారిని ప్రిన్సిపాల్ జి.ఎస్.కె.చక్రవర్తి అభినందించారు.